ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 130 | మంగళవారం 13, జనవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# బీఆర్ఎస్ తెచ్చిన పరిశ్రమలకే రిబ్బన్ కటింగ్

**కేసీఆర్‌కు పేరు రాకుండా కుట్రలు**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన పరిశ్రమలకే ప్రస్తుతం రిబ్బన్లు కట్ చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో ఐటీ హబ్ ఏర్పాటు చేసి 14 పరిశ్రమలను తీసుకొస్తే, వాటిని కొనసాగించలేని పరిస్థితులు ఇప్పుడు సృష్టిస్తున్నారని ఆరోపించారు. పాలమూరు రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, యూరియా సరఫరా చేయలేని వారు సస్యశ్యామలం చేస్తామని

..మిగతా 2లో





# పతంగుల పండుగలో మోడీ సందడి

**అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన మోడీ**

**సబర్మతీ తీరంలో మూడు రోజుల వేడుకలు**

**ప్రధానితో కలిసి పాల్గొన్న జర్మన్ ఛాన్సలర్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

భారత ప్రధాని నరేంద్ర మోడీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌తో కలిసి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సందడి చేశారు. సబర్మతీ నది తీరంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ గాలిపటాల ఉత్సవాన్ని ఇద్దరు నాయకులు అధికారికంగా ప్రారంభించారు. అనంతరం గాలిపటాలను ఎగరవేస్తూ ఉత్సవంలో పాల్గొన్నారు. దీనికి ముందు సమర్మతి ఆశ్రమాన్ని సందర్శించిన మోడీ, మెర్జ్ మహాత్మాగాంధీకి నివాళులు అర్పించారు. ఆ తర్వాత గాలిపటాల పండుగ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వేదిక సమీపంలో మహిళా కళాకారులతో మోడీ, మెర్జ్ సంభాషిస్తూ గాలిపటాల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. జనవరి 14 వరకు ఈ ఉత్సవం కొనసాగనుంది. ఆపరేషన్ సిందూర్‌కు

..మిగతా 2లో

# తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల జీతాల్లో కోత

**కన్నవారిని పట్టించుకోకపోతే జీతంలో కోత**

**ఆ మొత్తాన్ని నేరుగా వారి తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో జమ**

**త్వరలో కొత్త చట్టం తీసుకురాబోతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటన**

**వృద్ధులైన తల్లిదండ్రులు తమ పిల్లలపై చేసే ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించాలని ఆదేశం**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కన్న తల్లిదండ్రుల బాగోగులు చూడని ప్రభుత్వ ఉద్యోగులపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. అలాంటి ఉద్యోగుల జీతంలో 10 శాతం కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా వారి తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో

..మిగతా 2లో

# జిల్లాల పునర్విభజనపై కమిటీ వేస్తాం

**సమగ్ర అధ్యయనం తర్వాతే నిర్ణయం**

**తప్పుడు ప్రచారం చేయడం తగదు**

**అందరి అభిప్రాయాలు తీసుకుంటాం**

**రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదు**

**అందుకే మార్చాలనుకుంటున్నాం**

**నేను ఒక్కరోజు కూడా లీవ్ తీసుకోకుండా పనిచేస్తున్నా**

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

జిల్లాల సరిహద్దులు మార్చాలన్న విజ్ఞప్తులు తమ దృష్టికి వస్తున్నాయని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాల పునర్విభజనపై అధ్యయనం చేయడానికి త్వరలో విశ్రాంత న్యాయ మూర్తి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయ నున్నట్లు ప్రకటించారు. ఆ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల అభిప్రాయాలను సేకరిస్తుందని చెప్పారు. అందరి సూచనలు

..మిగతా 2లో

# పోలవరం–నల్లమల సాగర్‌పై రేవంత్ ద్రోహం



**రిట్ ఉపసంహరణతో ఏపీకి గడువు ఇచ్చినట్టే..**

**మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నిజస్వరూపం, ద్రోహబుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడిందని ఆరోపించారు. గతంలో పాలమూరు ప్రాజెక్టుపై రైతులతో ఆంధ్రప్రదేశ్

..మిగతా 2లో

# రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శక సేవలు

**అవినీతిరహిత సేవల కోసమే ఇంటిగ్రేటెడ్ భవనాలు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**

**మేడ్చల్ మల్కాజిగిరిలో కొత్త భవనానికి శంకుస్థాపన**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రేషన్ శాఖను పూర్తి పారదర్శకతతో, ప్రజలకు సులభమైన సేవల కేంద్రంగా మార్చేందుకు ముఖ్యంగా ముందుకొచ్చింది. ఈ క్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కూకట్‌పల్లి మండలంలో ఎస్ఎస్ఆర్ బిల్డర్స్ నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ భవనాలు ప్రజలకు సౌకర్యం అందించడంతో పాటు కార్పొరేట్ ప్రమాణాల ప్రకారం నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో దశలవారీగా మూడు విడతల్లో ఈ భవనాలు నిర్మాణం కానున్నాయన్నారు. మొదటి విడతలో

..మిగతా 3లో

# ఉపాధి హామీపై కాంగ్రెస్ దుష్ప్రచారం

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం**

**కొత్త చట్టంతోనే పారదర్శకత అని వెల్లడి**

**ఒవైసీ ముస్లిం మహిళా ప్రధాని వ్యాఖ్యలకు కౌంటర్**



03

# తెలంగాణ పిటిషన్‌కు విచారణ అర్హత లేదు

**పోలవరం-నల్లమలసాగర్‌పై సుప్రీం కీలక తీర్పు**

**రిట్ పిటిషన్ ఉపసంహరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం**

**సివిల్ సూట్ దాఖలు చేసేందుకు నిర్ణయం**



02

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ పాఠశాలలు

**రాష్ట్ర కలల ప్రాజెక్ట్‌గా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్**

**నిర్మాణాలు పూర్తి చేసే బాధ్యత కలెక్టర్లదే**

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**


అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించి రాష్ట్రంలోని పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ రాష్ట్ర

..మిగతా 2లో

# ఇస్రో ప్రయోగం విఫలం!

**పీఎస్ఎల్‌వీ సీ-62లో సాంకేతిక లోపం**

**కక్ష్యలోకి చేరని 15 ఉపగ్రహాలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన పీఎస్ఎల్‌వీసీ 62 రాకెట్ ప్రయోగంలో సాంకేతిక అంతరాయం ఏర్పడింది. దేశ రక్షణ రంగానికి కీలకమైన 'ఈఓఎస్ఎన్ 1' (అన్వేష) ఉపగ్రహాన్ని మోసుకెళ్లిన ఈ రాకెట్‌లో మూడో దశలో సమస్య తలెత్తినట్లు ఇస్రో ఛైర్మన్

..మిగతా 2లో



## పతంగుల పండుగలో మోడీ సందడి

**మొదటిపేజీ తరువాయి**

గుర్తుగా ప్రత్యేకంగా రూపొందించిన గాలిపటం ఆకర్షణగా నిలిచింది. 1917లో మహాత్మాగాంధీ స్థాపించిన సబర్మతి ఆశ్రమం 1930 వరకు ఆయన నివాసంగా కొనసాగింది. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఇది కీలక కేంద్రంగా నిలిచింది. పర్యటనలో భాగంగా గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్ కన్వెన్షన్ సెంటర్‌లో మోడీచ మెర్జ్‌ల మధ్య ద్వైపాక్షిక సమావేశాలు జరగనున్నాయి. భారత్, జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు జరిపి, అనంతరం సంయుక్త ప్రకటన విడుదల చేయనున్నారు.

**సంక్రాంతికి కొత్త కార్యాలయానికి ప్రధాని**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొత్త కార్యాలయం దాదాపుగా సిద్ధమైంది. మకర సంక్రాంతి రోజు అయిన జనవరి 14న ఆయన కొత్త పీఎంఓకు మారే అవకాశం ఉంది. 'సేవాతీర్థ్'గా పేరుపెట్టిన ఈ కాంప్లెక్స్‌లో ప్రధాని కార్యాలయం, క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్‌కు వేర్వేరు భవనాలు ఏర్పాటు చేశారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి సౌత్ బ్లాక్‌లో కొనసాగుతున్న పీఎంఓ తొలిసారిగా మరో ప్రాంతానికి మారనుంది. పాత కార్యాలయం ఖాళీ అయిన తర్వాత సౌత్, నార్త్ బ్లాక్‌లను 'యుగే యుగీన్ భారత్ సంగ్రహాలయ'గా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. రైసినా హిల్ సమీపంలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ సముదాయాన్ని నిర్మాణ దశలో 'ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్'గా పిలిచేవారు. తాజాగా దీనికి 'సేవాతీర్థ్' అని పేరు పెట్టారు. సేవాతీర్థ్1లో ప్రధాని కార్యాలయం, సేవాతీర్థ్2లో క్యాబినెట్ సెక్రటేరియట్, సేవాతీర్థ్3లో జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్‌తో పాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కార్యాలయం ఉన్నాయి. కొత్త కార్యాలయం సమీపంలోనే ప్రధాని కొత్త నివాసం కూడా నిర్మాణం పూర్తయ్యే దశలో ఉంది. ప్రస్తుతం 7 లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న నివాసం నుంచి త్వరలోనే మోడీ కొత్త నివాసానికి మారనున్నారు.

## బీఆర్ఎస్ తెచ్చిన పరిశ్రమలకే రిబ్బన్ కటింగ్

**మొదటిపేజీ తరువాయి**

చెప్పడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. కృష్ణా జలాలను సమయానికి వినియోగించుకోకపోవడం వల్ల కిందకు వెళ్లిపోతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈ విషయంలో కేసీఆర్‌కు పేరు రావద్దనే ఆలోచనతోనే ప్రభుత్వ పెద్దలు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టే మాటలతో పాలన సాగుతోందని, అభివృద్ధి పనులకు నిధులు లేవని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర నిధులు దిల్లీకి వెళ్లిపోతే ఇక్కడ అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఆంధ్రా కాంట్రాక్టర్లకు పెద్దపీట వేస్తున్నారన్న ఆరోపణలు కూడా తెరపైకి వచ్చాయని గుర్తుచేశారు.

హామీలు, పథకాల అమలుపై ప్రశ్నిస్తే దూషణలకు దిగుతున్నారని, అదృష్టవశాత్తు సీఎం అయ్యారని మాత్రమే చెప్పుకోవాల్సిన పరిస్థితి ఉందని కేటీఆర్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులేకుండా జరిగినప్పటికీ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తు ఉంటుందని తెలిపారు. కారు గుర్తును గుర్తుపెట్టుకుని ఓటేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆలోచనాశీ




లి అభ్యర్థులను బీఆర్ఎస్ బరిలోకి దింపుతుందని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు లేకున్నా కేసీఆర్ ఉంటారని ప్రజలు భావించారని, ఆ లాజిక్‌ను మరిచిన ఫలితమే ఎదురైందన్నారు. మళ్లీ అదే తప్పు చేయకుండా ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేయాలని సూచించారు. రెండేళ్ల తర్వాత కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తే అభివృద్ధి పనులు ఊపందుకుంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కొడంగల్ సహా పలు నియోజకవర్గాల్లో ఈసారి కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కేటీఆర్ అన్నారు.

### పోలవరం–నల్లమల సాగర్‌పై
## రేవంత్ ద్రోహం

**మొదటిపేజీ తరువాయి**

రిట్ పిటిషన్ వేయించి స్టే తెచ్చుకున్న కాంగ్రెస్ ఇప్పుడు తెలంగాణకు అన్యాయం చేస్తోందని అన్నారు. విచారణార్హత లేని పిటిషన్‌ను దాఖలు చేసి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసిందని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులను ఏపీకి ధారాదత్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ద్రోహానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకుని సివిల్ సూట్ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని, దీని వల్ల పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఏపీకి సమయం ఇచ్చినట్లేనని హరీశ్‌రావు అన్నారు. నాలుగు రాష్ట్రాల వాదనలు వినే ప్రక్రియ ఏళ్ల తరబడి సాగుతుందని, ఈలోగా ఏపీ ప్రభుత్వం పనులను పూర్తిచేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో బలహీనమైన రిట్ వేసి, సంక్రాంతి వేళ ఏపీ సీఎం చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గిఫ్ట్ ఇచ్చినట్లైందని విమర్శించారు. టెండర్ల చివరి తేదీ దాటిన తర్వాత కోర్టుకు వెళ్లడం ద్వారా నల్లమల సాగర్‌కు పరోక్షంగా అంగీకారం తెలిపినట్టేనని అన్నారు. పసలేని రిట్‌తో ప్రాజెక్టుకు సంపూర్ణ మద్దతు ఇచ్చారని ఆరోపించారు.



పంచాయితీలు, కోర్టులు వద్దని.. చర్చల ద్వారా సమస్య పరిష్కరిద్దామని రేవంత్‌రెడ్డి చెప్పడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. చర్చల పేరుతో తెలంగాణ నీటి హక్కులను ఏపీకి అప్పజెప్పడమే లక్ష్యమా అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి గురుదక్షిణ కోసం ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. సీఎం వైఖరిని ప్రజాస్వరంలో ఎండగడతామని, తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ చివరి వరకు పోరాడుతుందని ప్రకటించారు.

# తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల జీతాల్లో కోత

**మొదటిపేజీ తరువాయి**

జమ చేసేలా త్వరలోనే ఒక ప్రత్యేక చట్టం తీసుకురాబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. వృద్ధులైన తల్లిదండ్రులు తమ పిల్లలపై చేసే ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

సోమవారం నాడు దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేసే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ కీలక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా రెట్రోఫిట్టెడ్ వాహనాలు, బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి పరికరాలు వంటివి పంపిణీ చేశారు. ఈ కొత్త పథకానికి ప్రభుత్వం రూ. 50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే, వయోవృద్ధుల కోసం 'ప్రణామ్' పేరుతో డేకేర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతి కార్పొరేషన్‌లో ఒక కోఆప్షన్ సభ్యుడి పదవిని ట్రాన్స్‌జెండర్లకు కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యలను నేరుగా ప్రస్తావించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అన్నారు. దీనితో పాటు, 202627 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో నూతన ఆరోగ్య విధానాన్ని ప్రవేశపెడతామని స్పష్టం చేశారు.

దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారు సమాజంలో ఆత్మగౌరవంతో బతికేలా మానవతా దృక్పథంతో పనిచేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. వికలాంగుడైనప్పటికీ అత్యున్నత స్థాయికి ఎదిగిన మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి అందరికీ స్ఫూర్తిదాయకమని



గుర్తుచేశారు. ప్రభుత్వం ఇప్పటికే దివ్యాంగుల వివాహాలకు రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని, విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా కల్పిస్తోందని వివరించారు.

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ పాఠశాలలు

**మొదటిపేజీ తరువాయి**

డ్రీమ్ ప్రాజెక్ట్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. ఈ పాఠశాలలు దేశంలోనే రోల్ మోడల్‌గా, గేమ్ చేంజర్‌లుగా నిలుస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ప్రజాభవన్ నుంచి జిల్లా కలెక్టర్లు, చీఫ్ సెక్రటరీతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ ప్రగతిపై సమగ్రంగా సమీక్షించారు. పాఠశాలల నిర్మాణం పూర్తి చేసే బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని స్పష్టం చేశారు.

టెండర్లు పూర్తైన ప్రాంతాల్లో మంత్రి లేదా స్థానిక ఎమ్మెల్యేతో కలిసి భూమిపూజ నిర్వహించి, భవనాల నిర్మాణం పూర్తయ్యేలా స్పష్టమైన క్యాలెండర్ ఖరారు చేయాలని ఆదేశించారు. ప్రతి వారం నిర్మాణ ప్రగతిపై సమీక్ష నిర్వహించాలన్నారు. నెలలో కనీసం ఒకసారి కలెక్టర్లు స్వయంగా నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి అక్కడే సమీక్ష చేయాలని సూచించారు. పాఠశాలల నిర్మాణానికి నిధుల కొరత లేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లుల చెల్లింపు జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను విడివిడిగా కాకుండా ఒకే క్యాంపస్‌లో ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక సమైక్యతకు తెలంగాణ ప్రభుత్వం గొప్ప సందేశం ఇస్తోందన్నారు. సమాజంలో వర్గాలుగా విడిపోయిన విద్యార్థు



లను ఒకే చోట చేర్చే ప్రయత్నమే ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అని చెప్పారు. ఒప్పందం కుదిరిన 15 రోజుల్లో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఎక్కువ శాతం పాఠశాలలు అందుబాటులోకి రావాలని ఆదేశించారు. భూమి, అనుమతులు వంటి స్థానిక సమస్యలు ఉంటే ఎమ్మెల్యేలు, సీసీఎల్ఏ లేదా చీఫ్ సెక్రటరీతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని చెప్పారు. నిర్మాణాల్లో నాణ్యతపై రాజీ ఉండదని స్పష్టం చేసిన డిప్యూటీ సీఎం, క్వాలిటీ చెక్ కోసం థర్డ్ పార్టీ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ ఏజెన్సీ నేరుగా నిర్మాణ ప్రదేశాలకు వెళ్లి తనిఖీలు చేయాలన్నారు. పనుల పురోగతిపై వారానికి ఒకసారి చీఫ్ సెక్రటరీ కలెక్టర్ల నుంచి నివేదికలు తీసుకోవాలని సూచించారు.

## తెలంగాణ పిటిషన్‌కు విచారణ అర్హత లేదు

- **పోలవరం-నల్లమలసాగర్‌పై సుప్రీం కీలక తీర్పు**
- **రిట్ పిటిషన్ ఉపసంహరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం**
- **సివిల్ సూట్ దాఖలు చేసేందుకు నిర్ణయం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ అంశంపై గురువారం అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరగగా, తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. విచారణ అనంతరం తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల మధ్య వివాదాలకు సంబంధించి ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేయడం సరైన మార్గమని సీజేఐ సూచించారని మంత్రి తెలిపారు. కోర్టు సూచన మేరకే ప్రస్తుత రిట్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నామని, త్వరలోనే సివిల్ సూట్‌తో మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై తమకు తీవ్ర అభ్యంతరాలున్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏపీకి గోదావరి బేసిన్‌లో కేటాయించిన 484.5 టీఎంసీలకు మించి నీటిని వినియోగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి ఉల్లంఘనలను ఇప్పటికే కోర్టు దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. గోదావరి, కృష్ణా నదీ బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు అసలు డిజైన్‌కు మించి మార్పులు చేయడానికి వీల్లేదని, కేంద్రం జారీ చేసిన 'స్టాప్ వర్క్' ఆదేశాలను కూడా అమలు చేయడం లేదని కోర్టుకు వివరించినట్లు చెప్పారు. తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ప్రాజెక్టులపై న్యాయపోరాటం తప్పదన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేయడం ద్వారా అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవడం మరింత సులభమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. వరద జలాల పేరుతో అదనపు నీటిని తరలించే హక్కు ఏపీకి లేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. అనుమతులు లేని పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పనులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటాను కాపాడుకోవడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. చర్చల ద్వారా పరిష్కారం సాధించేందుకు సిద్ధమే అయినప్పటికీ, అక్రమ నిర్మాణాల విషయంలో న్యాయపోరాటం కొనసాగుతుందని, తెలంగాణ రైతాంగం భవిష్యత్తు కోసం చివరి వరకు పోరాడుతామని మంత్రి తేల్చి చెప్పారు.



## జిల్లాల పునర్విభజనపై కమిటీ వేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

తీసుకున్న తర్వాతే జిల్లాల సరిహద్దులపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

రాచకొండ కమిషనరేట్‌కు సంబంధించి కూడా సీఎం వివరణ ఇచ్చారు. ఆ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే ఉద్దేశంతోనే మార్పు చేశామని చెప్పారు. పరిపాలన సులభతరం కావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని స్పష్టం చేశారు. సెలవు తీసుకోవాలని అనుకున్న ప్రతిసారీ ఏదో ఒక కీలక పని వచ్చి పడుతోందని అన్నారు. సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ (టీజీఓసీఏ) ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వాన్ని నడిపేది కొద్ది మంది మంత్రులు లేదా అధికారులు మాత్రమే కాదని, రాష్ట్రాన్ని నిజంగా ముందుకు తీసుకెళ్తున్నది 10.50 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులేనని అన్నారు. "ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరు. ఉద్యోగులే ప్రభుత్వానికి సారథులు, వారధులు. ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే వారూ మీరే" అని ఉద్యోగులను ప్రశంసించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. "ఉద్యోగుల్లో కూడా నేను అంటే నచ్చని వారు చాలామంది ఉండొచ్చు. కానీ నేను ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత ఉద్యోగుల జీతాలు ఎలా సమయానికి వస్తున్నాయో మీరే గమనించాలి" అని అన్నారు. ఈ కార్యక్రమానికి రావడానికి ముందే ఉద్యోగుల డీఏ ఫైళ్లపై సంతకం చేసి వచ్చానని వెల్లడించారు.

ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి విలువైన బీమా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ప్రకటించారు. గత ప్రభుత్వాల కాలం నుంచి పేరుకుపోయిన ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు సుమారు రూ.12 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని, బకాయిలు చెల్లించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వనరులపై కూడా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. పన్నులు పెంచాల్సిన అవసరం లేదని, పన్ను వసూళ్లలో జరుగుతున్న అవకతవకలను అరికడితే రావాల్సిన నిధులు తప్పకుండా వస్తాయని అన్నారు. "సరిగా వసూళ్లు చేస్తే చాలు. ప్రజలపై అదనపు భారం వేయాల్సిన అవసరం లేదు" అని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన మరో కీలక హామీని సీఎం ప్రకటించారు. కొత్తగా ఏర్పడే జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని వెల్లడించారు. ఉద్యోగులు ప్రశాంతంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. మొత్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, పరిపాలనా సంస్కరణలు, ఆర్థిక క్రమశిక్షణే తమ ప్రభుత్వ విధానమని సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో మరోసారి స్పష్టం చేశారు.

## ఇస్రో ప్రయోగం విఫలం!

**మొదటిపేజీ తరువాయి**

వి. నారాయణన్ తెలిపారు. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి సోమవారం ఉదయం 10.18 గంటలకు పీఎస్ఎల్వీసీ62 రాకెట్ ప్రయోగించారు. ఈ ప్రయోగం మొత్తం నాలుగు దశల్లో పూర్తి కావాల్సి ఉండగా, మూడో దశ వరకు ప్రయాణం సజావుగానే సాగిందన్నారు. అయితే మూడో దశ చివర్లో రాకెట్ నిర్దేశిత మార్గం నుంచి పక్కకు వెళ్లడంతో ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టలేకపోయామని ఆయన వెల్లడించారు.

ఈ మిషన్‌లో ప్రధాన ఉపగ్రహమైన 'ఈఓఎస్ఎన్1'తో పాటు భారత్, యునైటెడ్ కింగ్‌డమ్, థాయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన మరో 14 చిన్న ఉపగ్రహాలు ఉన్నాయి. వీటిని కక్ష్యలోకి పంపే సమయంలోనే ఈ అంతరాయం చోటుచేసుకుంది. 2026 సంవత్సరంలో ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం ఇదే. ఇస్రో ప్రాథమిక విశ్లేషణ ప్రకారం, మూడో దశలో చాంబర్ ప్రెజర్ అనూహ్యంగా తగ్గడంతో అవసరమైన థ్రస్ట్ అందలేదు. దీంతో రాకెట్ సమతుల్యత కోల్పోయి దిశ తప్పినట్లు అధికారులు తెలిపారు. అంతరిక్షంలో అధిక వేగంతో ప్రయాణించే సమయంలో చిన్న లోపం కూడా మిషన్ విఫలమయ్యే పరిస్థితికి దారి తీస్తుందని ఇస్రో వర్గాలు పేర్కొన్నాయి. ఈ మిషన్‌ను న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) తొమ్మిదో పూర్తి స్థాయి వాణిజ్య ప్రయోగంగా చేపట్టింది. ప్రధాన ఉపగ్రహం 'ఈఓఎస్ఎన్1'ను డీఆర్డీవో అవసరాల కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఇది సరిహద్దుల నిఘా, వ్యవసాయం, విపత్తుల నిర్వహణలో కీలకంగా ఉపయోగపడాల్సి ఉంది. పీఎస్ఎల్వీ మూడో దశలో సమస్య తలెత్తడం ఇది వరుసగా రెండోసారి కావడం గమనార్హం. గతంలోనూ ఇలాంటి సాంకేతిక లోపంతో ఒక మిషన్ విఫలమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, భవిష్యత్ ప్రయోగాల్లో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఇస్రో స్పష్టం చేసింది.



# ఉపాధి హామీపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- కొత్త చట్టంతోనే పారదర్శకత అని వెల్లడి
- ఓవైసీ ముస్లిం మహిళా ప్రధాని వ్యాఖ్యలకు కౌంటర్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకంపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికతను వినియోగిస్తున్నామని, పారదర్శకతతో పాటు జవాబుదారీతనాన్ని పెంచామని తెలిపారు. వంద రోజులుగా ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచినట్లు వెల్లడించారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత తలెత్తకుండా ఉపాధి హామీ పనులను వ్యవసాయంతో అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు 125 రోజుల ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ పథకం వల్ల రాష్ట్రాలపై కొంత అదనపు భారం పడుతుందని అంగీకరిస్తూనే, కేంద్ర ప్రభుత్వం కూడా అదనంగా ఖర్చు చేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు సృష్టిస్తూ దళారీ వ్యవస్థ నడిపే వారిని నిర్మూలించడమే కొత్త చట్టం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సూచనల మేరకు ఉపాధి హామీ పథకంలో అవసరమైన మార్పులు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా బీజేపీ గాలివాటంతో గెలుస్తోందన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటమే అయితే దేశంలో మూడుసార్లు ఎలా అధికారంలోకి వచ్చామో చెప్పాలని ప్రశ్నించారు. మరోసారి ఎన్నికల్లో గెలిచి నరేంద్ర మోడీ మళ్లీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రాజకీయంగా పని అయిపోయిందని వ్యాఖ్యానించిన కిషన్‌రెడ్డి.. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి తాము తమ సత్తా నిరూపించామని అన్నారు.

**విభజన రాజకీయాలే ఓవైసీ లక్ష్యం**

ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. హిజాబ్ ధరించే ముస్లిం మహిళ భారతదేశ ప్రధాని కావాలని ఓవైసీ కోరడం వెనుక దేశాన్ని మత ప్రాతిపదికన విభజించే రాజకీయ ఆలోచనలే ఉన్నాయని ఆయన విమర్శించారు. నిజంగా అంత ధైర్యం ఉంటే పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లకు వెళ్లి అక్కడ హిందూ మహిళ ప్రధాని కావాలని డిమాండ్ చేయగలరా అని ప్రశ్నించారు. భారతదేశంలో మైనారిటీ వర్గాలకు అత్యున్నత గౌరవం లభించిన అనేక ఉదాహరణలు ఉన్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. మైనారిటీ వర్గాలకు చెందిన వారు రాష్ట్రపతి పదవులు నిర్వహించారని, ముఖ్యంగా డాక్టర్ ఏపీ జె అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా చేసిన ఘనత బీజేపీకే దక్కిందని స్పష్టం చేశారు. అయినా కూడా మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఓవైసీ వ్యాఖ్యలు మత విద్వేషాలను పెంచేలా ఉన్నాయని, ప్రజలను విభజించే కుట్రలను ప్రజలు గమనించాలని ఆయన సూచించారు. భారత్ నుంచి విడిపోయిన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల పరిస్థితులు నేటి ప్రపంచానికి స్పష్టంగా కనిపిస్తున్నాయని, అలాంటి పరిస్థితులు భారత్‌లో రావాలని ఓవైసీ కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. భారతదేశంలో హిందువులు మెజారిటీగా ఉండటం వల్లే ప్రజాస్వామ్యం బలంగా కొనసాగుతోందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హిందువులు మెజారిటీగా లేకపోతే ప్రజాస్వామ్యం నిలవదని, భద్రత కూడా ఉండదని హెచ్చరించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల తరహా పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో మతాల పేరుతో రాజకీయాలకు చోటు లేదని, దేశ అభివృద్ధే తమ ఏకైక లక్ష్యమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయంలో మత ప్రాతిపదికన డిమాండ్లు చేస్తూ విభజన రాజకీయాలు చేయడం దేనికి సంకేతమో ఓవైసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శక సేవలు

**మొదటిపేజీ తరువాయి**

ఔటర్ రింగ్ రోడ్ పరిధి, రెండో విడతలో జిల్లా కేంద్రాలు, మూడో విడతలో నియోజకవర్గ కేంద్రాల్లో కానున్నట్లు చెప్పారు. మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ భవనంలో ఇప్పటికే సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినదని తెలిపారు. జూన్ నాటికి భవనాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వానికి ఆర్థిక భారం పడకుండా బిల్డర్స్‌తోనే భవనాలు నిర్మిస్తున్నామని, నిర్మాణ సంస్థలు కనీసం ఐదు సంవత్సరాలు భవనాల నిర్వహణ బాధ్యత తీసుకోవాలని చెప్పారు.

ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ఆదాయ వనరుగా కాకుండా ప్రజలకు సేవల కేంద్రంగా మార్చి, పేదల కోసం దృష్టి పెట్టి మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. గతంలో ఇచ్చిన భూములను రక్షించడం, అక్రమాలను అణచివేయడం కోసం చర్యలు తీసుకుంటున్నామని, పేదలకు న్యాయసమానంగా పరిహారం, ప్రత్యామ్నాయ భూములు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. మేడారం జాతర కోసం ఇప్పటికే భారీ నిర్మాణాలు చేపట్టామని, ప్రజలు జాతరకు భారీగా తరలిరావాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే



మాధవరం కృష్ణారావు, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



# దేశ ప్రతిష్టను విశ్వ వ్యాప్తం చేసిన చైతన్య మూర్తి వివేకానందుడు.

- ఎమ్మెల్యే మేఘారెడ్డి.
- వనపర్తిలో ఘనంగా 163 వ జయంతి వేడుకలు.
- వివేకానందుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి.

**వనపర్తి ప్రతినిధి,జనవరి 12(ప్రజాస్వరం):**

దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన గొప్ప చైతన్య మూర్తి స్వామి వివేకానందుడని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సోమవారం ఆయన 163వ జయంతిని పురస్కరించుకొని వనపర్తిలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలలకు చాటిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. యువత వివేకానందుడి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద జిల్లా కమిటీ సభ్యులు కోటేశ్వర్ రెడ్డి, భాను ప్రసాద్, పిచ్చయ్య, యాపర్ల రామ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణ గౌడ్ లతోపాటు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి, కృష్ణ, బిజెపి నాయకులు సబి రెడ్డి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, మాజీ కౌన్సిలర్లు బ్రహ్మంచారి, బాపనపల్లి వెంకటేష్, పద్మ పరశురాం, ఎల్ఐసి కృష్ణ, చీర్ల సత్యం సాగర్, యాదగిరి, ప్రముఖ వైద్యులు డాక్టర్ పగడాల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, సత్యశీలారెడ్డి, ఉద్యమ నాయకుడు దేవన్న నాయుడు, ఆశ్రమ నిర్వాహకులు విట్టా శ్రీనివాసరెడ్డి,బాసెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఫిబ్రవరి 2 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి.

- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి,జనవరి 12 (ప్రజాస్వరం):**

జిల్లాలో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 2 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రాక్టికల్ పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థులు పరీక్షలకు సకాలంలో చేరుకునేలా పరీక్షల సమయానికి ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, కేంద్రాల్లో విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య మాట్లాడుతూ పరీక్షల వివరాలను వెల్లడించారు. జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి 21వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ విభాగాలు కలిపి మొత్తం 5,639 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ఇందులో ఇంటర్మీడియట్ జనరల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3,360 మంది ఉండగా, ఒకేషనల్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు చెందిన విద్యార్థులు 2,279 మంది ఉన్నట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు పూర్తైన అనంతరం ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభమై మార్చి 18వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.








# రంగాపూర్ లో రంగవల్లులు.

- యువతకు వివేకానందుడు స్ఫూర్తి.
- కాంటెస్టెడ్ సర్పంచ్ సుధారాణి.
- రంగాపూర్ లో ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు.

**వనపర్తి ప్రతినిధి,జనవరి12(ప్రజాస్వరం):**


పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామంలో వివేకానంద జయంతి, సంక్రాంతి పండగలను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన రంగవల్లుల పోటీలకు మహిళలు పోటీపడ్డారు. కాంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి సుధారాణి ప్రోత్సాహంతో నిర్వహించిన రంగవల్లుల విజేతలకు బహుమతులు అందజేసి వివేకానంద జయంతి వేడుకలను సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ యువత స్వామి వివేకా నందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.రాంచంద్రారెడ్డి అధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ యుగేందర్ రెడ్డి పాల్గొని గ్రామస్తులకు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి కాంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి సుధారాణి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేశారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భారత దేశ ఖ్యాతిని, సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పారని ఆమె పేర్కొన్నారు.యువత చేతు ల్లోనే దేశభవిష్యత ఆధార పడి ఉంటుందన్నారు. యువతీ, యువకులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శవంతంగా నిలుస్తున్నారన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల నాయకులు,అంగన్వాడి కార్యకర్తలు,బాలికలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# యువతకు మార్గదర్శకుడు స్వామి వివేకానంద యువతకు ప్రేరణ.....స్వామి వివేకానంద....

**కుత్బుల్లాపూర్,జనవరి 12. (ప్రజాస్వరం):**

దుందిగల్ సర్కిల్ పరిధి GHMC 295 డివిజన్ భౌరంపేట్ లో జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వారి విగ్రహానికి డివిజన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతలో ఆత్మవిశ్వాసం, ధైర్యం, దేశభక్తిని నింపిన మహానుభావుడని. లేచి నిలబడండి... లక్ష్యాన్ని చేరే వరకు అగకండి అన్న ఆయన సందేశం నేటి యువతకు ఆదర్శం అన్నారు. విద్య అనేది కేవలం పుస్తక జ్ఞానం కాదని వ్యక్తిత్వాన్ని నిర్మించేదని ఆయన బోధించారని అన్నారు.ఈ కార్యక్రమంలో భౌరంపేట్ పిఏసిఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి , నాయకులు మిద్దెల యాదిరెడ్డి, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి , దుండిగల్ సర్కిల్ బిజెపి అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి,కృష్ణారెడ్డి,ప్రశాంత్,అతీష్ బాబు బీజేవైఎం జిల్లా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



# జాతీయస్థాయి ఫుట్బాల్ పోటీలకు జగత్ పల్లి యువకుడు ఎంపిక.

**పెద్దమందడి,జనవరి 12(ప్రజాస్వరం):**

జాతీయస్థాయి ఫుట్బాల్ పోటీలకు జగత్ పల్లికి చెందిన కావలి లోకేష్‌నాయుడు ఎంపికయ్యాడు. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థి లోకేష్ నాయుడు డిసెంబర్ 11 నుంచి 13 వరకు నల్గొండలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కాగా జనవరి 11 నుంచి 15 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి ఫుట్బాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయికి ఎంపికైన లోకేష్ నాయుడును ఫిజికల్ డైరెక్టర్ వినోద్ కుమార్ తో పాటు ఫుట్బాల్ అసో



సియేషన్ జిల్లా అధ్యక్షులు పెబ్బేరు కృష్ణకుమార్ రెడ్డి,కోచ్ నాగరాజు అభినందించారు.



## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**మెదక్ జనవరి 12 (ప్రజా స్వరం) :**

తపస్ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సోమవారం మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తపస్ నాయకులు వివికానందుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జిడ్డు ఎల్లం, ప్రధాన కార్యదర్శి జాల సిద్దు, మెదక్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మెరుగు నరేందర్, నాయని సత్య నారాయణ, మండల అధ్యక్షులు తుందెన బిక్షపతి, బకొల్ల మహేష్, దాసు ప్రభాకర్, అచ్చానపల్లి లక్ష్మీనారాయణ, తపస్ జిల్లా పూర్వ అధ్యక్షులు దత్తాత్రేయ, కులకర్ణి, తపస్ నాయకులు పాల్గొన్నారు.

## యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



- డీఎస్పీ నరేందర్ గౌడ్

**చిన్న శంకరంపేట జనవరి 12 ( ప్రజాస్వరం ) :**

యువత స్వామి వివేకానంద ఆచరణ స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ అన్నారు, చిన్న శంకరంపేట మండలం చందంపేట గ్రామంలో స్థానిక సర్పంచ్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు అనంతరం గత ఏడు సంవత్సరాలుగా ఉపయోగం లేని గ్రంథాలయాన్ని స్థానిక సర్పంచ్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉపయోగం లోకి తీసుకురావడం తో ఆ గ్రంథాలయాన్ని తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ ప్రారంభించారు అదేవిధంగా గ్రామంలో సీసీ కెమెరాలు ప్రారంభించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు, ఈ సమావేశంలో విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి, అనంతరం డిఎస్పి నరేందర్ గౌడ్ చేతుల మీదుగా వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు, కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను శాలువా తో పాటు భగవద్గీతలను అందజేసి ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి ఎస్సై నారాయణ గౌడ్ స్థానిక సర్పంచ్ ప్రవీణ్ కుమార్ తో పాటు డిఎస్పి నరేందర్ గౌడ్ లు మాట్లాడుతూ యువత అనుకుంటే సాధ్యం కానిది ఏది లేదని యువత చెడు మార్గానికి పోకుండా సక్రమమైన మార్గంలో నడుస్తూ గ్రామాల అభివృద్ధికి యువత నడుం బిగించాలని వారు కోరారు, స్వామి వివేకానంద ఆశయ సాధన కోసం ఆయనను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని తెలిపారు యువత స్వామి వివేకానంద ఆశలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు, వివేకానందుడి సూక్తులు నేటి యువతకు ఎంతో మార్గదర్శకమని వాటిని నిత్యజీవితంలో ఆచరించాలని వారు కోరారు, గ్రామంలో యువత సహకరిస్తే గ్రామాన్ని సుందరవందనంగా తీర్చిదిద్దుతానని గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే గ్రామాన్ని అని రంగాల్లో అభివృద్ధి చేసుకోగలమని సర్పంచ్ ప్రవీణ్ కుమార్ సూచించారు, ఈ కార్యక్రమంలో డిఎస్పి నరేందర్ గౌడ్ స్థానిక సర్పంచ్ ప్రవీణ్ కుమార్ సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి ఎస్సై నారాయణ గౌడ్ పంచాయతీ కార్యదర్శి పద్మ ఉప సర్పంచ్ నర్సింలు నాయకులు ప్రకాష్, రమేష్, సుధాకర్, బలరాం, వీరేశం, యాదగిరి, రామకృష్ణ, పుట్ట శ్రీనివాస్, దత్తు, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

## శిశు మందిర్‌లో వివేకానంద జయంతి




**ఆదిలాబాద్ జిల్లా జనవరి 12 (ప్రజాస్వరం):**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రములోని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇచ్చోడ మేజర్ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ కొడప జలయ్ జాకు గారు,13 వ వార్డు సభ్యులు కొల్లూరి చంద్ర శేఖర్ గారు, సీనియర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అల్లి శ్రీనివాస్ గారు,ప్రదీప్ కుమార్ గారు, శ్వేత గారు పాల్గొని స్వామి వివేకానంద చిత్ర పటానికి పూల మాలలు వేశారు. అనంతరం వక్తలు ఒరగంటి ఇస్తారి గారు,మిట్టపల్లి దత్తాత్రేయ గారు,పిల్లి నరేష్ గారు మాట్లాడుతూ స్వామి వివేకానంద నేటి యువతకు స్ఫూర్తి దాయకం అని భారత దేశానికి వారు చేసిన సేవలు మరువలేనివి అని వారు గొప్ప సంఘ సంస్కర్త అని వారు స్థాపించిన రామకృష్ణ మిషన్ ద్వారా నేటికీ దేశ విదేశాలలో ఉన్న మన భారతీయులకు సేవలు అందుతున్నాయని అన్నారు. అనంతరం రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా వెహికిల్ ఇన్స్పెక్టర్ లు అల్లి శ్రీనివాస్ గారు, ప్రదీప్ కుమార్ గారు, శ్వేత గారు యువకులకు ట్రాఫిక్ నియమాల గురించి అవగాహన కల్పించారు.సైన్ బోర్డుల గురించి, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు మనం చేయవలసిన, పాటించ వలసిన పనుల గురించి వివరించి అందరితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సమంపెల్లి సుదర్శన్, ప్రదానాచార్యులు మరాఠీ సంతోష్ కుమార్,ఆచార్యులు ఉషారాణి, సుజాత,భారతి ABVP నాయకులు సుధాకర్,అరుణ్,అరవింద్,వెంకటేష్,లక్ష్మణ్,సాయి యువకులు, విద్యా

# సింగూరు జలాలు జిల్లా రైతుల హక్కు

### నీళ్ల కోసం సీఎంకు పోస్టు కార్డు రాయండి

- క్రాప్ హాలిడే ఇచ్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- 25 వేల నష్టపరిహారం ఎకరాకు ఇవ్వాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి
- బీఆర్ఎస్ పార్టీ రైతు ధర్నా



**మెదక్ జనవరి 12 (ప్రజా స్వరం) :**

యాసంగి పంటకు సింగూరు జలాలు విడుదల చేయాలంటూ మెదక్ కలెక్టరెట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు, డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు దిక్కు లేదని అన్నారు. సింగూర్ నీళ్లు ఘనపూర్ ఆయకట్టు కింద రైతులకు నీళ్లు ఇవ్వాలని, లేదంటే క్రాఫ్ హాలీ డే ప్రకటించి రైతులకు ఎకరాకు 25 వేల పరిహారం ఇవ్వాలని అన్నారు. సింగూర్ జలాలు మెదక్ జిల్లా ప్రజల హక్కు తెలిపారు. కృష్ణ జలాలను ఆంధ్ర ప్రాంతానికి అప్పనంగా అప్పగించేందుకు సీఎం కుట్ర చేస్తున్నారని, సింగూరు నీళ్ల విషయంలో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. రెండేళ్ల క్రితం రి పేర్ చేస్తే రైతులకు ఇబ్బంది జరిగేది కాదని, సింగూర్ నీళ్లు సాగు కు, తాగు నీటి కి ఇవ్వాల్సి ఉందని అన్నారు. 40 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని, స్థానిక ఎమ్మెల్యే సింగూర్ నీళ్ల విషయంలో మాట్లాడతలేడని అన్నారు. ఇప్పుడు నీళ్లు ఇవ్వమని కలెక్టర్ చెబుతున్నరని అన్నారు. నష్టపరిహారం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే సీఎం ను కలిసి రైతులకు ఇప్పించాలని తెలిపారు. యూరియా కోసం చెప్పులు పెట్టే పరిస్థితి ఏర్పడిందని, యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెడుతుందని అన్నారు. అవగాహన లేని వ్యక్తులు సీఎం గా, ఎమ్మెల్యే గా ఉన్నారని, బిఆర్ఎస్ బలపరిచి గెలిచిన సర్పంచ్ లకు కండువా కప్పుకున్నారని అన్నారు. రైతులకు నీళ్ల కోసం సీఎం కు పోస్టు కార్డు రాస్తాం, రైతుల కష్టాలు తెలియని వాళ్ళు రాజ్యమేళుతున్నారని విమర్శించారు. ఇసుక దందాలు చేస్తూ రైతులను పట్టించుకోవడం లేదని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఏమైంది. జాబ్ లు అడిగితె నిరుద్యోగులను లాఠీ చార్జీ లు చేస్తున్నరని పేర్కొన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్ర లో లేదని అన్నారు. సింగూర్ నీళ్ల విషయంపై సీఎం రివ్యూ చేసిండ్రా అసలు ఈ విషయం ఎవరికి తెలుసని అన్నారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వకుంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. రేవంత్ సర్కార్ లో అన్ని వర్గాలు అసంతృప్తి తో ఉన్నాయని, ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ నెరవేర్చడం లేదని అన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో ఏ రోజు రోడ్డు ఎక్కింది లేదని అన్నారు. సింగూర్ జలాలను మెదక్ జిల్లా కే కేటాయించింది కెసిఆర్ మాత్రమే అన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చింది రైతులకు కష్టాలు తెచ్చిందానే విధంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. సింగూరు ప్రాజెక్టు లో వ్యవసాయానికి నీళ్లు ఇవ్వాలని జీవో ఉందని, కానీ దానిని అమలు చేయడం లేదని అన్నారు. నీటి రంగ నిపుణులు చెప్పిన ప్రభుత్వం పట్టించుకోలే ఇప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు.



యాసంగిలో పంటలు వేస్తె ఎండిపోయే పరిస్థితి ఉందని అన్నారు. రైతులు నార్లు పోసుకున్నారు, కొందరు రైతులు నాట్లు కూడా వేసుకున్నారు ఇప్పుడు నీళ్లు ఇవ్వం అని అధికారులు చెప్పడం రైతులకు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పాలకులు రైతులపై కక్ష్య సాధింపు చర్యలు చేపడుతున్నారాని, ఏది సరైన పద్ధతి కాదని అన్నారు. రైతులు వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం క్రాఫ్ హాలీ డే ప్రకటించి రైతులకు ఎకరాకు 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కు తెలిసేలా రైతులంతా పోస్ట్ కార్డు ఉద్యమం చేపడుతామని తెలిపారు. పంటలు వేసుకున్న రైతులకే రైతు భరోసా ఇస్తామని చెప్పడం దారుణం అన్నారు. రైతులకు సన్న వడ్ల కు ఇచ్చే బోనస్ ఎగ్గొడుతుందని గుర్తు చేశారు. మెదక్ ప్రాంత రైతుల సాగునీటి సమస్య విషయం స్థానిక ఎమ్మెల్యే కు కనిపించడం లేదా ప్రశ్నించారు. 24 గంటల కరెంట్ ను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు 12 గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నారని అన్నారు. జిల్లా అధికారులు రైతులను పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మాజీ గ్రంధాలయ చైర్మన్ చంద్ర గౌడ్, సర్పంచ్లు, మాజీ కౌన్సిలర్స్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గృహజ్యోతి సర్టిఫికెట్ల పంపిణీ



**తూప్రాన్ జనవరి 12(ప్రజా స్వరం) :**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో గృహ జ్యోతి పథకం 235 మంది లబ్ధిదారులకు వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు జారీ చేసిన ఉచిత గృహ జ్యోతి సర్టిఫికెట్లను సోమవారం సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకునే లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తుందని సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, లైన్ మెన్ నర్సింలు, వార్డు సభ్యులు పిట్ల వేణు, జిన్న కృష్ణ, నాయకులు కొండల్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.


## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**మెదక్ జనవరి 12 (ప్రజా స్వరం) :**

తపస్ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సోమవారం మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తపస్ నాయకులు వివికానందుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జిడ్డు ఎల్లం, ప్రధాన కార్యదర్శి జాల సిద్దు, మెదక్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మెరుగు నరేందర్, నాయని సత్య నారాయణ, మండల అధ్యక్షులు తుందెన బిక్షపతి, బకొల్ల మహేష్, దాసు ప్రభాకర్, అచ్చానపల్లి లక్ష్మీనారాయణ, తపస్ జిల్లా పూర్వ అధ్యక్షులు దత్తాత్రేయ, కులకర్ణి, తపస్ నాయకులు పాల్గొన్నారు


## దేవాలయం భూమిని కాపాడండి



- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి పాటి గ్రామస్తుల విజ్ఞప్తి

**పటాన్ చెరు, జనవరి 12(ప్రజా స్వరం) :**

ముత్తంగి డివిజన్‌లోని పాటి గ్రామ పరిధిలో గల హనుమాన్ దేవాలయానికి చెందిన దేవుడి మాన్యం భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు గ్రామ ప్రతినిధులు పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డిని కలసి భూసంరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్థులు వెల్లడించిన వివరాల ప్రకారం గ్రామంలోని సర్వే నంబర్ 197లో ఒక ఎకరా 33 గుంటలు హనుమాన్ దేవాలయం పేరుపై ప్రభుత్వ రికార్డుల్లోనూ నమోదై ఉందని తెలిపారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు ఆ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం పై స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ మరియు దేవాదాయ భూములను కబ్జా చేసే వారికి క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. త్వరలోనే సంబంధిత అధికారులతో పూర్తి సర్వే నిర్వహించించి భూమి రక్షణకు ప్రభుత్వ సహాయంతోపాటు అవసరమైతే సొంత నిధులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష సభ్యులు పాల్గొన్నారు.

## వట్టిపల్లిలో గ్రామసభ

**జగదేవ్‌పూర్, జనవరి12, (ప్రజాస్వరం) :**
జగదేవ్ పూర్ మండలం వట్టిపల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ చింతల విద్యాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.గ్రామంలోని పలు సమస్యలను ప్రజలు లేవనెత్తారు. అందులో భాగంగా ప్రధానమైన సమస్యగా కోతుల బెడద ఏ విధంగా పరిష్కరించాలి దానిపైన ప్రత్యేక చొరవ చూపాలని గ్రామస్తులు వాపోయారు. వాటిని త్వరగా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.అలాగే ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధి కి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాను,ఉప సర్పంచ్ నాగరాజు,వార్డు సభ్యులు,అంగన్వాడి టీచర్,ఆశా వర్కర్లు,ఫీల్డ్ అసిస్టెంట్,మిషన్ భగీరథ,సిఏ,తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- సర్పంచ్ యాదగిరి



**శివ్వంపేట, జనవరి 12 ( ప్రజా స్వరం ) :**
మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని శభాష్ పల్లి సర్పంచ్ అయ్యగారి యాదగిరి అన్నారు. శభాష్ పల్లిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంలో మహిళల పాత్ర కీలకమని కొనియాడారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి వీణ, పానగారి వెంకటేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**గజ్వేల్/వర్గల్ జనవరి 12 (ప్రజాస్వరం) :**
మండలంలోని తుంకి ఖాల్సా గ్రామాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను సర్పంచ్ గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద ఆదర్శాలను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువకులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఓటరు జాబితా విడుదల



**తూప్రాన్, జనవరి 12 (ప్రజాస్వరం) :**
తూప్రాన్ మున్సిపల్ తుది ఓటర్ జాబితాను కమిషనర్ పాతూరి గణేశ్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. గతంలో ఉన్న 20,427 మంది ఓటర్ల నుండి, ఇతర గ్రామాలకు చెందిన 168 మందిని తొలగించారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో మొత్తం 20,259 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. వార్డుల వారీగా వివరాలను నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. ఓటర్లు తమ పేర్లను తుది జాబితాలో సరిచూసుకోవాలని కమిషనర్ సూచించారు.



## కాళ్లకల్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**తూప్రాన్ జనవరి 12 (ప్రజా స్వరం ) :**
మనోహరాబాద్ మండలం కాళ్లకల్ లో సర్పంచ్ నవ్య నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు యువత కు మార్గ దర్శకుడు స్వామి వివేకానంద అని ఆయన అన్నారు కార్యక్రమం లో పాలకవర్గం యువకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ సామాజిక తనిఖీ



**తూప్రాన్ జనవరి 12 (ప్రజాస్వరం ) :**
తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో సోమవారం పంచాయతీ ఆవరణలో ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ గ్రామసభను నిర్వహించారు. సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో 2024 2025 సంవత్సరంలో గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల నివేదికను సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామసభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, ఉపసర్పంచ్ స్వామి, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గౌరీ శంకర్ గౌడ్ సేవలు చిరస్మరణీయం



- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**గుమ్మడిదల, జనవరి 12(ప్రజా స్వరం) :**
ప్రత్యేక తెలంగాణ సాధనలో కీర్తిశేషులు గౌరీ శంకర్ గౌడ్ పోషించిన పాత్ర చిరస్మరణీయమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గౌరీ శంకర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లిలో ఉచిత వైద్య శిబిరం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పుష్పమాల అర్పించి ఘన నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి రాజకీయాలలో సౌమ్యుడిగా, అజాతశత్రువుగా నిలిచే అరుదైన గుణాలన్నీ గౌరీ శంకర్ గౌడ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. జిన్నారం,గుమ్మడిదల రాజకీయాలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న నాయకుడని అభినందించారు. ఆయన ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రవీణ విజయ్ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గౌడ్ కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివేకానంద జయంతి వేడుకలు

**నార్సింగి, జనవరి 12 ( ప్రజా స్వరం ) :**
నార్సింగి మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతి పురస్కరించుకొని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించి వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలన్న సందేశాన్ని ఇచ్చిందని అన్నారు. యువత స్వామీ వివేకానంద చూపిన మార్గంలో కలిసి కట్టుగా పయనించి దేశ అభ్యున్నతికి పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంద కార్యవాహక్ కొన్యాల సోమరాజు, శిశు మందిర్ ప్రధాన ఉపాధ్యాయుడు బాబా, యువజన సంఘాల నాయకులు పోచయ్య, అమర్, సతీష్, రమేష్, మల్లేశం, రాజు, నరేష్, సత్య పాల్ రెడ్డి, దాసు, బాలరాజు, సాయిరాం, సంతోష్, శ్రీనివాస్, బిక్షపతి, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## తూప్రాన్‌లో వివేకానంద జయంతి వేడుకలు



**తూప్రాన్, జనవరి 12 (ప్రజాస్వరం) :**
తూప్రాన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద జయంతి జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా సరస్వతి సేవ సమితి మరియు రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో మహంకాళి దేవాలయం నుండి ర్యాలీగా వెళ్లి పూలబాలలు వేసి నివాళులర్పించారు వారు మాట్లాడుతూ వివేకానంద (18631902) భారతదేశానికి చెందిన ఒక ప్రముఖ ఆధ్యాత్మిక నాయకుడు, తత్వవేత్త, సంస్కర్త. ఆయన రామకృష్ణ పరమహంస శిష్యుడు. 1893లో చికాగోలో జరిగిన ప్రపంచ మత సమ్మేళనంలో భారతదేశం తరపున ప్రసంగించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమం లో బొడ్డు శ్రీహరి ఏపూరి రాజు తాటి వెంకటేష్ తుమ్మెట శ్రీనివాస్ యాదవ్ మధుసూదన్ శ్రీశైలం నరేష్ శివ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు

# యువతకు స్వామి వివేకానంద గొప్ప స్ఫూర్తి





- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

**తూప్రాన్ జనవరి 12 (ప్రజాస్వరం) :**
తూప్రాన్ పట్టణంలో స్వామి వివేకానంద జయంతి తుమ్మెట శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూం కుంట నర్సారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు ఆయన మాట్లాడుతూ యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తిదాయకమని ఆయన తెలిపారు స్వామి వివేకానంద యువతకు గొప్ప స్ఫూర్తి ప్రదాత. ఆయన బోధనలు యువతను జాగృతం చేసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి.అని వివేకానందుడు చెప్పిన కొన్ని ముఖ్యమైన సూక్తులు.. లేవండి! మేల్కొండి! గమ్యం చేరే వరకు విశ్రమించకండి.అని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి.. బలహీనులుగా మార్చే ప్రతి ఆలోచననూ తిరస్కరించండి. వివేకానందుడు యువతకు దిశానిర్దేశం చేస్తూ, వారిని బలవంతులుగా, ఆత్మవిశ్వాసంతో నిండినవారిగా మార్చాలని కోరారు ఆయన బోధనలు యువతను జాగృతం చేసి, వారిలో స్ఫూర్తిని నింపుతాయి. యువత చెడు కు దూరంగా ఉండాలని ఎవరైనా చెడు మార్గంలో వెళ్తే నివారించి మంచి మార్గం వైపు నడిపించాలని ఆయన అన్నారు పార్టీలకు అతీతంగా యువకులకు ఎలాంటి అవసరం ఉన్నారు సేవ చేయడానికి సిద్ధాంగా ఉనాన్నని తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో నాచారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ చైర్మన్ రవీందర్ గుప్తా మాజీ కౌన్సిలర్లు జ్యోతి మామిండ్ల కృష్ణ పెయింటర్ శీను భగవాన్ రెడ్డి శ్రీశైలం గౌడ్ మామిడి చిన్న నాగరాజుగౌడ్ వెంకటేష్ జానకిరామ్ గౌడ్ మహేష్ గౌడ్ తాటి విట్టల్ సామల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నాచాగిరిలో గిరి ప్రదక్షిణ

**తూప్రాన్ జనవరి 12 (ప్రజాస్వరం) :**
సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం సోమవారం శ్రీ మాధవ నంద స్వామి ఆధ్వర్యంలో ఉదయం 7:30 కి ప్రారంభమైంది స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా ఈ ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. నాచాగిరి శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి ఆలయం పురివిధులలో ఉదయం 7:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ విశిష్టత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగే ఈ ప్రదక్షిణ భక్తులకు పుణ్యాన్ని ప్రసాదిస్తుంది.స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు స్వామివారి నామ జపంతో ప్రదక్షిణ చేశారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తుంకుంట నర్సారెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్తా పల్లెర్ల పాలకవర్గం సభ్యులు ఆలయ అర్చకులుబుక్క అశోక్ వేణుగోపాల్ రవీందర్ భారీగా భక్తులు మహిళలు హాజరై గిరి ప్రధక్షణ చేశారు.



# కాంగ్రెస్‌లో చేరిన ముప్పిరెడ్డిపల్లి సర్పంచ్



**మనోహరాబాద్, (ప్రజాస్వరం) :**
మనోహరాబాద్ మండలం లోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ గా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన కందల రాజనర్సింహ సోమవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు సింగి రాంరెడ్డి, నాయకులు మహిపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు, గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలి

- **ఎస్ఐ బాలరాజు**

**రామయంపేట, జనవరి12 (ప్రజాస్వరం) :**
సంక్రాంతి సెలవు నేపథ్యంలో రామయంపేట మండల పరిధిలోని గ్రామాలలో తల్లిదండ్రులు తమ తమ పిల్లలపై దృష్టిసారించాలని రామయంపేట ఎస్ఐ బాలరాజు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించినందున గాలిపటాలు ఎగరవేసే పిల్లలు చైనా మాంజను ఉపయోగించే వద్దన్నారు. చైనా మంజా ద్వారా ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని మాంజాను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందన్నారు. అలాగే చెరువులు కుంటలు నిండుకుండలా ఉన్నాయని స్నేహితులతో పిల్లలు సరదాగా చెరువులోకి ఈతకు అని వెళ్లి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని గ్రామాల్లోని తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలన్నారు.




ఈ పండుగ సొంత ఊర్లోకి వెళ్లేవారు తప్పకుండా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

# వివేకానంద జయంతి వేడుకలు



**రామాయంపేట, జనవరి 12 (ప్రజాస్వరం) :**
మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని దుర్గామాత యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్థానిక బస్టాండ్ వద్ద సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన మహనీయుడు వివేకానందా అన్నారు. ఆయన చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాబు నాయక్, దుర్గామాత యూత్ అధ్యక్షుడు శ్యామ్లు. వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, క్యాషియర్ సందీప్ కుమార్, సభ్యులు మల్లేశం,సర్దార్ నాయక్,బాబు. యాదగిరి పాల్గొన్నారు.



# నరసింహాల గుట్టపై భక్తి వెల్లువ

- **నరసింహస్వామి గుట్టకు పోటెత్తిన భక్తులు**
- **రామాయంపేటలో ఘనంగా నవకుండాత్మక సుదర్శన నరసింహా హోమం**

**రామాయంపేట, జనవరి 12 (ప్రజాస్వరం) :**
పట్టణ ఆధ్యాత్మిక చరిత్రకు మరొక స్వర్ణాధ్యాయం చేరింది. రామాయంపేట పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం (నరసింహాల గుట్ట)లో నిర్వహించిన నవకుండాత్మక సుదర్శన నరసింహా హోమం భక్తుల సంద్రమధ్య అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు గుట్టపైకి తరలి వచ్చి, భక్తి శ్రద్ధలతో హోమంలో పాల్గొని దేవుని అనుగ్రహం కోసం ప్రార్థనలు చేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య, అగ్నికుండాల నుంచి లేచిన హోమాగ్ని జ్వాలలు పరిసరాలను ఆధ్యాత్మిక కాంతితో నింపాయి. పట్టణంలోని అన్ని కుల సంఘాల ముఖ్య పెద్దలు ఒకే వేదికపై హోమంలో కూర్చోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "మన ఊరు - మన గుడి" అనే నినాదంతో పట్టణ ప్రజలంతా ఏకమై ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సామాజిక సమైక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ హోమం ద్వారా పట్టణానికి శాంతి, శుభం, సుభిక్షం కలగాలని, ప్రజలంతా ఆరోగ్యంగా, ఐశ్వర్యవంతంగా ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. నరసింహ స్వామి కృపతో రామాయంపేట అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరై, లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ఆవరణలో స్వామివారి దర్శనం అనంతరం వారు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక





కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రతు రావు. రమేష్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరితో పాటు వివిధ కుల సంఘాల పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి తమ మద్దతు ప్రకటించారు. దేవాలయ అభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణలో ప్రజలందరి భాగస్వామ్యం అత్యవసరమని వారు స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసం, ప్రజల సామూహిక భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ నవకుండాత్మక సుదర్శన నరసింహ హోమం రామాయంపేట చరిత్రలో ఒక విశిష్ట ఆధ్యాత్మిక ఘట్టంగా నిలవనుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నరసింహాల గుట్ట మరోసారి భక్తి, శక్తి, శాంతి సంగమంగా మారి... పట్టణానికి దివ్య శోభను చేకూర్చింది.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**మెదక్ జనవరి 12 (ప్రజా స్వరం) :**
పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేస్తూ ఆర్థికంగా ఆదుకుంటుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. సోమవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హవేలీ ఘనాపూర్, మెదక్ మండలాలకు చెందిన షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే రోహిత్ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్ల పెళ్లి చేయడం కుటుంబానికి భారం కావొద్దని ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకంతో ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి సంక్షేమం అనే ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హవేలీ ఘనపూర్, మెదక్ పట్టణం, మెదక్ మండలాల సర్పంచులు, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి

**దౌల్తాబాద్, జనవరి 12( ప్రజాస్వరం ):**
సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఒక వ్యక్తి మృతి చెందాడు. మల్లేశంపల్లి గ్రామానికి చెందిన పుర్రె కనకయ్య ద్విచక్ర వాహనంపై దౌల్తాబాద్ నుండి మల్లేశంపల్లికి వెళ్తుండగా, కోనాపూర్ మొండి చింత బస్‌స్టాప్ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈ ఘటన శేర్‌పల్లి-బందారం గ్రామపంచాయతీ పరిధిలోని మధురై గ్రామం, నర్సంపేట శివారులో జరిగింది. ప్రమాదం తీవ్రతతో, కనకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం, ప్రమాదానికి కారణాలు ఇంకా సుస్పష్టంగా తెలియాల్సి ఉందని సంఘటన స్థలంలో పరిశీలన కొనసాగుతున్నదని




తెలిపారు. డ్రైవింగ్ సమయంలో రోడ్డు పరిస్థితులు, ఎదురుగా వస్తున్న వాహనంపై పూర్తి పరిశీలన దర్యాప్తులో భాగంగా జరుగుతోందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999